# ప్రాణం తీసిన పరుగు !

ఈమధ్య దూరపు బంధువువొకాయన మా ఇంటికొచ్చాడు. మనిషి వఠి పోచికోలు ఎప్పుడూ లొడలొడ వాగుతూంటాడు. పైరవీలు చేసి పర్సంటేజి తీసుకుని పన్లు చేసిపెడుతూ బతికేస్తుంటాడు ! అరికాళ్లలో సుళ్లున్నాయేమో దేశదిమ్మరిలా తిరుగుతూంటాడు ! ఒక్కచోట తిన్నగా కాలు నిలవదు.

సి.ఎం. దగ్గర్నుంచి ఛీఫ్ సెక్రటరీ వరకు అంతా ఎరిగినవాళ్లే కావటంతో ఎవరికే పని కావాలన్నా సునాయాసంగ చేసి పెడుతూంటాడు.

మొదట్లో వఠి కబుర్ల మనిషి అనిన్నూ... కోతలు కోస్తుంటాడనేసి అతని మాటలు నమ్మేవారు కాదు. రానురాను ఆతడి సత్తా ఏమిటో అందరికీ తెలిసింది !

పని కావటం కోసమో... చేయించుకోవటానికో ఎవరికైనా పోయిస్తాడే గానీ తను మాత్రం మందుకు ఆమడ దూరం ! నాన్‌వెజ్ జోలికి పోడు. బ్రేక్‌ఫాస్ట్ కూడా ఇడ్లీకే పరిమితం ! దోసె... పూరీ... చపాతీ వంటి నూనె సరుకు ముట్టడు !

అందరికీ తల్లో నాలుకలాంటివాడు రామనాథం ! మనిషి సన్నగ పొడవుగ పాతకాలం సినిమాల్లో కమెడియన్ రమణారెడ్డిని పోలి వుంటాడు.

మనిషి ఆకారం... అవతారం చూస్తే మాత్రం రామ్మూర్తి అంతటి ఘనుడన్పించడు. అందరికీ తల్లో నాలుకలాంటివాడు.

ఏ మనిషిని ఏ పనికి ఎలా వుపయోగించుకోవాలో... అతనికి వెన్నతో పెట్టిన విద్య !

అలాంటి రామనాథం చాలా కాలానికి మాయింటికొచ్చాడు. సరైన సమయానికే వచ్చినందుకు సంతోషించాను.

అంకంత కొంపలో నేను క్షమతి ఇద్దరమే ! వంటికి ఇంటిపన్లు చేసిపెట్టటానికి మనుషులున్నారు. కొడుకులిద్దరూ విదేశాల్లో... ఎప్పుడో వారికి మేం గుర్తొచ్చినపుడు వచ్చి చూచిపోతూంటారు.

నాకూ ఎనిమిది పదులు దాటటంతో లాయర్ ప్రాక్టీస్ మానేశాను ! సంపాదించినంతమటుక్కు చాలనుకున్నాను. నా దగ్గర గుమాస్తా చేసి మానేసిన అతగాడి తల్లి మా ఇంట్లో వంటకు పాతికేళ్ల క్రిందటే కుదిరింది. ఆమెను మేం వంటమనిషి

అనుకోము ! మా కుటుంబంలో ఒక సభ్యురాలిగ కల్సిపోయింది. ఆమెకేలోటు రాకుండా మేమూ చూచుకుంటూ వుంటాను.

డబ్బు ఖర్చుకు వెనకాడని మనిషిన్నేను ! ఆపదలో నో... అవసరంలోనూ ఎదుటివారిని ఆదుకునే స్వభావం నాది !

మా మనిమనిషి అమృతమ్మ కూడా పదేళ్లబట్టి మా ఒక్క ఇల్లే కనిపెట్టుకుని వుంది. ఇంట్లో అన్ని పన్లూ చేస్తుంది.

అమృతమ్మకు ఒక్కడే కొడుకు ! వాడిని చదివించుకుంటోంది. పిల్లాడికి అయిదేళ్ల ప్రాయంలో మొగుడు ఆటో తోలుతూ లారీ గుద్దేయటంతో స్పాట్ డెత్ !. లాయరుగా నేనే దాని కేసు కోర్టులో సెటిల్ చేయించి దానికి నాలుగు డబ్బులొచ్చేట్టు చేశాను. పనిమనిషి అమృతమ్మ కొడుకు సంరక్షణ నేనే నెత్తినేసుకున్నాను పాపం ఒంటరి ఆడది కావటాన!

నా భార్య మోకాళ్ల నెప్పులతో గత పదేళ్లుగ బాధపడుతూండటాన... ఇంట్లో సైతం నడవలేని పరిస్థితి రావటంతో ఆమెకో వీల్‌ఛైర్ కొరనిచ్చి అందులోనే ఇంట్లో తాగటం తప్పనిసరైంది.

అమృతమ్మ కొడుకు చదువులో పెద్దగా ఎక్కిరాకపోవటం నన్ను నిరుత్సాహపరిచింది. అప్పటికీ ట్యూషన్ పెట్టాను. టెన్త్ బోటిబొటీ మార్కులతో పాసవటం కష్టమైంది. ఏమైతేనేం డింకీ కొట్టకుండా వక్క ఛాన్స్‌లోనే మిడకటంతో సగం తృప్తిపడ్డాను.

గోపయ్య ఇంటర్ చదవటానికి ససేమిరా అన్నాడు మొండికేశాడు ! అలావాడిని వదిలేస్తే జులాయిగ తిరగటానికి అలవాటుపడి... చెడ్డ అలవాట్లకు ఎక్కడ లోనవుతాడోని అన్పించేది. వాడంతా వాళ్ల తండ్రి పోలిక. మంచి శరీర ధారుద్యం కలవాడు! మూడు పూటలూ కడుపునిండా తిని హరాయించుకోగల వక్తి వున్నవాడు. ఎగ్గు... మటన్ లాంటివి ధారాళంగ తింటాడు.

'అయ్యా!... నా కొడుక్కి పోలీసు కావాలని వుందయ్యా... వాడికి మీరే సాయం చెయ్యాలి...' అమృతమ్మ ఒకరోజు నా కాళ్లమీద పడ్డది.

పోలీసు వుద్యోగం గోపయ్యకు ఎలా ఇప్పించటమాని సీరియస్‌గ ఆలోచిస్తూండగ రామనాధం ఆర్తరక్ష పరాయణుడిలా మా ఇంటికొచ్చాడు.

'రావయ్యా రామనాధం రా!... ఇన్నాళ్లకు నేను మా ఇల్లు గుర్తుకొచ్చామన్నమాట... ' ఆహ్వానం పలికాను.

'ఎంతమాట?.. ఎంతమాట?- క్షణం తీరిక వుండి చావటంలేదనుకోండి ! మీ పనే హాయి. ఎంచక్కా కాలుమీద కాలేసుకుని దర్జాగా శేషీవితాన్ని గడిపేస్తున్నారు. - నన్ను చూడండి... కాళ్లకు బలపాలు కట్టుకుని వాళ్ల పని.. వీళ్ల పని అంటూ... తిరగటమే సరిపోతోంది. పెళ్లాం పిల్లలకేం కావాలో కనుక్కునే తీరిక కూడా వుండటంలేదంటే నమ్మండి....'

'రా ! అట్లా కూర్చో...' అనేసి వంటావిడను కేకేసి' మా రామనాధం వచ్చాడు ! వీడూ మనతోపాటే భోజనం చేస్తాడు...' అన్చెప్పి రెండు కాఫీ పంపించండి మాకు...' అన్నాను.

ఇంతలో శ్రీమతి వీల్‌ఛైర్లో వస్తూ 'ఏమయ్యా... మమ్మల్ని బొత్తిగా మర్చిపోయావా ఏమిటి !.. మరీ నల్లపూసవైనావ్...' నిష్ఠూరమాడింది.

'అనుకుంటూ నేవున్నా మీరిలా నామీద నిందేదో మోపుతారని.... మీకు ఈ కుర్చీతో అనుబంధం ఇంకా ఎన్నేళ్లు... ? - ' రామనాధం జోకాడు.

'చచ్చేవరకూ...! కొన్ని బాధలకు విరుగుడు వుండదు. బాధపడాల్సిందే ! అలాంటి వాటిలో మోకాళ్ల నొప్పుల రోగం వొకటి...'

'మీకేమండీ... శ్రీరామచంద్రుడి లాంటి భర్త... రత్నాల్లాంటి ఇద్దరు మగపిల్లలు... కావలసినంత సంపద... కాలు కిందపెట్టక్కర్లేదు. వంట మనిషి... పనిమనిషి... కారు డ్రైవరు... మీ అంతటి అదృష్టవంతులుండటం అరుదు.

'మమ్మల్ని చూసిపోవటానికి వచ్చినందుకు ఎంతో సంతోషంగా వుంది రామనాధం... అవునూ... ఆడపిల్ల పెళ్లి చేశావా ? - మగవెధవ ఏం చేస్తున్నాడు. చదువైపోయి వుద్యోగమేదైనా వెలగబెడుతాన్నాడా ?... నువ్వు సంపాదించేది అనుభవిస్తూ కాలోపం చేస్తున్నాడా ?- '

'ఏం చెప్పను నాకష్టాలు ? - పిల్లకు లక్షలు కుమ్మరించి పెళ్లి చేశాను. దానికి పిల్లలు పుట్టేయోగం లేదని డాక్టర్లు నిర్ధారించటంతో అల్లుడు అమ్మాయికి లీగల్‌గ విడాకులిచ్చే'శాడు - మగపిల్లవాడు నన్ను వుద్ధరిస్తాడని ఆశపడితే... ఆ గాడిదకొడుకేమో దొంగతనాలు మరిగాడు. స్నేహితులతో కలిసి ఇళ్ల తాళాలు పటులగొట్టి నగనట్రా దోచుకోవటం... జల్సాలకు అలవాటుపడ్డాడు. రెండుసార్లు శ్రీకృష్ణ జన్మస్థానానికి కూడా వెళ్లొచ్చాడు. వాడు ఇంటికి రావటం లేదు. నా దృష్టిలో... వాడు వున్నా లేనట్టే...' రామనాధం

మాటల్లో బాధ ద్యోతకమైంది.

'అలాగా...? ఇవన్నీ మాకు తెలియదే ! కష్టాలకడలిలో కొట్టుమిట్టాడుతున్నావన్నమాట?-' అతగాడి ముఖంలోకి తదేకంగా చూస్తూ అన్నాను.

'అంతే ... అంతే పిల్లలనైతే కనగలం గానీ వాళ్ల తలరాతలను కనలేం కదా? - బాధపడకు రామనాధం ఓదార్పుగ మాట్లాడింది నా శ్రీమతి.

మధ్యాహ్నం లంచ్ చేశాక నేనూ రామనాధం నా ఆఫీసు రూమ్‌లో కూర్చున్నాం.

'నీతో ఒక ముఖ్యమైన పని పడిందయ్యా'

'నాతో మీకు పనా ? - చెప్పండీ... చిటికెలో చేస్తాను...'

'మరేంలేదు... మాపనిమనిషి అమృతమ్మలేదూ... అది మమ్మల్నే కనిపెట్టుకుని ఎన్నో ఏళ్లుగ మా ఇంట్లో పనిచేసి బ్రతుకుతోంది. దానికి భర్తలేడు. ఒక్కడే సంతానం ! వాడు టెన్త్ పాసైనాడు... వాడికి ఏదైనా వుద్యోగం వేయించిపెట్టాలి.

'ఎవరు ? నేనా ? వుద్యోగం ఇప్పించటమా ? ' అయినా ఎవరికీ ? మీకా ?- '

'ఆపు నీ వేలాకోళం ! ఆకుర్రాడికి నేనే అన్నీ ! - మంచి పర్సనాలిటీ వున్నవాడు. పోలీసు వుద్యోగానికైతే సరిగ్గా సూటవుతాడు. గోపయ్య చేత పోలీసు కానిస్టేబుల్ వుద్యోగానికి అన్ని అర్హతలు వుండటంతో అప్లై చేయించాను. వాడు సెలక్ట్ అయ్యే పూచీ నీదే ! - ఎంత ఖర్చు అవుతుందో చెప్పు ! అంతా నేనే భరిస్తాను. నీకెలాంటి భయమూ అక్కర్లేదు. చుట్టంకదా... అందులోనూ వకీలు కదాని వెనక్కు తగ్గకుండా నీవంతు సాయం నువ్ చేసిపెట్టాలి ! - ఏం?- ' అంటూ కూర్చున్నవాడినల్లా లేచివెళ్లి సేఫ్‌లోంచి ఓ లక్ష రూపాయలు తెచ్చి రామనాధం చేతిలో పెట్టి 'ఇది కేవలం అడ్వాన్స్ మాత్రమే ! మిగతాది ఎంతో చెప్తే ఆ పని పూర్తయిన తర్వాత ఇచ్చేస్తాను...'

నామాట కాదన్లేని రామనాధం ఆ డబ్బు లాల్చీ జేబులో భద్రపర్చుకుని కేండిడేట్ వివరాలన్నీ తనవద్దగల పాకెట్‌బుక్‌లో నోట్ చేసుకున్నాడు.

X X X

'అమృతమ్మా ! - నీ కొడుకు పని అయిపోయినట్టే... వాడికి పోలీసు వుద్యోగానికి సెలక్షను వచ్చినట్టే...'

'అట్టనా బాబుగారూ... తమరి ఋణం ఈ జన్మలో తీర్చుకోలేనయ్యా...' తెగసంబరపడుతూ అంది.

'ఇంద ! ఈ డబ్బు నీ దగ్గరుంచు !... వాడికి ఏంకావాలో అది కొనివ్వు ! ఈ డబ్బు వాడి కోడిగుడ్డు ఖర్చుకు... పండ్లు... పాలు... మాంసం ఏది అవసరమో నీ కొడుక్కు కొనివ్వు !. అవునూ... రోజూ రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాడా?... మరో నెలరోజుల్లో వాడికి పిలపొస్తుంది.. ఇది చాలకపోతే మళ్లీ అడుగు. ఎంత కావాలన్నా ఇస్తాను. నీ కొడుక్కి వుద్యోగం రావటం మనకు ముఖ్యం... అర్థమైందా?-'

'అయింది బాబుగారూ...ఈ పేదరాలికి పుట్టిన బిడ్డ పట్ల తమకెంత ప్రేమసారూ? - క్రితం జన్మలో వాడు ఎలాంటి పుణ్యం చేసుకున్నాడో గానీ... ఈ జన్మలో మీవంటి గొప్పోరి సహాయం లభిస్తోంది...' ఆర్ద్రమైన కంఠంతో కృతజ్ఞత వెళ్లబోసుకుని పైటకొంగుతో కళ్లొత్తుకుంది అమృతమ్మ.

'అయినదానికి కానిదానికి నువ్వలా కళ్లనీళ్లు పెట్టుకోకు ! నే చేసే సహాయం ఎట్లాగూ చేస్తునే వుంటిని అది సరే బెయిలు మీద విడుదల అయిన నేరస్తుడు రోజూ పోలీస్ స్టేషన్‌కెల్లి రిజిస్టర్లో సంతకం పెట్టినట్టు... నీ కొడుకుని రోజూ వచ్చి నాకు కనిపించమను. ఇల్లు పట్టకుండా స్నేహితలతో వీధులవెంట బలాదూర్ తిరగద్దని చెప్పు గోపయ్యతో.

'అలాగే అయ్యా....' అనేసి వీధిలోకి నడిచింది.

X X X

సిటేట్లో కూర్చుని న్యూస్‌పేపర్ తిరగేస్తున్నాను. సరిగ్గా అప్పుడు పనిమనిసి కొడుకు గోపయ్య వీధిలోంచి లోపలికొచ్చాడు.

'గుడ్‌మార్నింగ్ సార్...' విష్ చేశాడు.

పేపర్లోంచి తల పక్కకు తిప్పి 'రావోయ్... రా! అవునూ... జిమ్‌కు రెగ్యులర్‌గా వెడుతున్నావా?. డయట్ తగినంత తీసుకుంటున్నావా?... అవునూ... రన్నింగ్ విషయం మర్చిపోకు!... ' గోపయ్యకేసి చూస్తూ మనసులో వున్నమాటలు చెప్పాను.

'అన్నీ ఓ.కే. సార్ ! '

'ఇప్పుడు బాగున్నావ్‌రా గోపయ్యా ! నునుపుతేలి చిన్నసైజు పహిల్మాన్‌లాగా అవుపిస్తున్నావ్. నువ్వు తప్పకుండా పోలీస్ కానిస్టేబుల్ జాబ్‌కి సూటవుతావ్ !! - '

నా మాటలకు సిగ్గుపడి ' సార్ సెలక్షన్ లెటర్ ఎన్నాళ్లకొస్తుందో తెలీకుండా వుంది...' గొణిగాడు.

'నువ్వేం వర్రీ అవకు ! ఆ విషయం గురించే పేపర్లో పడిన న్యూస్ చదువుతున్నాను. నువ్వొచ్చావ్ ! కాల్ లెటర్స్ డిస్పాచ్ అవుతున్నాయట. వచ్చేవారంలో ఫిజికల్ ఫిట్‌నెస్ సెలక్షన్లు జరుగుతాయని పేపర్లో వుంది...' వాడి చేతికి న్యూస్ లెటర్ అందించాను.

అది చదివిన గోపయ్య తెగ సంబరపడ్డాడు.

'అవునూ... నీ హైటు వెయిటు ఛెస్ట్ మెషర్‌మెంట్ వగైరా వివరాలు చెకప్ చేసుకున్నావా...'

నా ప్రశ్నలకు జవాబుగ తలాడించాడు.

సరిగ్గా అదే సమయానికి 'ప్లీడరు గారూ మీ పేరతో లెటరొచ్చింది' అని కేకేసి చెప్పటం విన్న గోపయ్య లేచివెళ్లి అందుకున్న కవరు తీసుకొచ్చి నా చేతిలో పెట్టాడు.

కవర్ ఓపెన్ చేసి చదివి 'సరిగ్గా ఈ విషయం గురించే క్షణం క్రితం మాట్లాడుకున్నామో లేదో... మరునిముషంలోనే నీ కాల్‌లెటర్ వచ్చేసింది. గోపయ్యా ! పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లుంటాయట... ఇంద ! ఈ కాల్‌లెటర్ నీ దగ్గరే భద్రంగ వుంచుకో !. ఇంకేం డూటే కూడా తెలిసింది. గెట్‌రెడీ.. ఆల్ ది బెస్ట్... ' అన్నీ ఒకరానివెంట మరొకటి చెప్పేశాను ఆనందం పట్టలేక.

కాల్‌లెటర్ ముద్దుపెట్టుకుని వీధిలోకి పరుగెత్తాడు గోపయ్య.

X X X

వుద్యోగం వస్తుందని... సెలక్షన్స్‌లో తాను తప్పక సెలక్ట్ అవుతాడనే వత్సాహంతో పోలీసు గ్రౌండ్స్ చేరుకున్నాడు గోపయ్య.

అప్పటికే చాలామంది అభ్యర్థులు అక్కడికి చేరుకుని వుండటం గమనించాడు.

తనూవెళ్లి క్యూలో నిలబడ్డాడు !

ఒకచోట ఎత్తు... మరొక చోట వెయిటు... ఇంకోచోట ఛెస్ట్ మెషర్‌మెంట్స్ వచ్చినవారికి చూస్తున్నారు పోలీసు అధికారుల బృందం.

ఫార్మాలిటీస్ ఇతర వివరాలు తీసుకున్న పిదప రన్నిగ్ రేస్ ఈవెంట్ వుంటుందిన మైక్ ద్వారా అక్కడున్నవారికి పదే పదే తెలియపరుస్తున్నారు.

అయిదు కిలోమీటర్ల పరుగుపందెం 'క్యూ' లో ఇతర కేండిడేట్స్‌తో పాటు తనూ నిలబడ్డాడు గోపయ్య.

విజిల్ ఊదగానే అభ్యర్థులంతా పరుగెత్తసాగారు. అయిదు కిలోమీటర్ల దూరం

తనకో లెఖలోనిదికాదు. తాను అవలీలగా పరుగెత్తి ఇచ్చిన టైమ్‌లోపే గమ్యం చేరుకొగతలననే ధీమాతో... ఏకాగ్రతతో పరుగెడుతున్నాడు గోపయ్య.

కొందరు అలిసిపోయి మధ్యలోనే ఆగిపోవటం గమనించాడు. మరికొంరు ముందుకు సాగలేక చతికిలబడటమూ చూస్తున్నాడు. తను అలాకాకూడదు. పరుగు...పరుగు... ఒకటే పరుగు తన శరీరం చెమటతో తడిసి ముద్ద అయింది. గొంతు ఎండిపోయి దాహమేస్తున్నా లక్షపెట్టకుండా... మంచినీటికోసం... దప్పిక తీర్చుకోవటానికి మధ్యే మార్గంలో ఆగితే తాను టైముకు గమ్యం చేరుకోలేకపోతాననే భయంతో... పరుగు వేగాన్ని పెంచక తప్పటంలేదు.

తనకంటే ముందు కొద్దిమందే పరుగెడుతూ అవుపించారు. నాలుగు కిలోమీటర్ల దూరాన్ని అధిగమించాడు. మరో కిలోమీటర్ ఉగ్గబట్టుకు పరిగెడితే... వుద్యోగం తప్పక తనకొస్తుందనే ఆశ గోపయ్య కళ్ల ఎదుట మేరు పర్వతంలా అవుపిస్తోంది.

దేవుళ్లను స్మరించుకుంటూ... తల్లిని ప్లీడరు గారిని పదేపదే గుర్తుచేసుకుని మనసులోనే సమస్కరిస్తూ... ఆయాసపడుతూ... రొప్పుతూ... రోజుతూ... గమ్యం చేరుకోవాలనే పట్టుదలతో పరుగెడుతున్నాడు. వక్తినంతా కూడదీసుకుంటున్నాడు. పరుగు మీదే ధ్యాస !

కానీ పలితం లేకుండాపోయింది. మరో పది నిముషాల్లో గమ్యాన్ని చేరుకునే సమయంలో అకస్మాత్తుగ గోపయ్య కుప్పకూలి స్పృహ తప్పిపోయాడు.

వెంటనే ఫాలో అవుతున్న అంబులెన్స్ ఆగింది. డాక్టర్ అంబులెన్స్ దిగి గోపయ్యను సమీమిపించి పల్స్ చూసి పెదవి విరిచాడు.

లక్ష్యాన్ని చేరుకోవాలనే తాపత్రయంతో ప్రాణం విలవిల్లాడిన గోపయ్య గమ్యాన్ని చేరుకోకముందే అతని ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది.

గోపయ్య శవాన్ని చూచి గుండెబాదుకుంది అమృతమ్మ. తండ్రీ పోలీసు కావాలని ఎంతో ఆరాటపడితివి కదత్రా. చివరికి ఆదే నీ ప్రాణం తీసిందా...' శోకాలు పెడుతూ కన్నీరు మున్నీరుగా విలపించింది, కన్నకొడుకు శవం మీద పడింది.

'ఇదేం ఖర్మరా గోపయ్యా ! చివరికి పరుగు పందెం నిన్ను బలిగొన్నదా...' అంటూ దు:ఖాన్ని ఆపుకోలేక కంటతడిపెట్టాను నిస్సహాయస్థితిలో.

--- సమాప్తం ---